ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025 | 5


మీరే నా బలం : జనసైనికులకు పవన్ అభివాదం


ఇదీ నా సేన : జయకేతనం సభ వేదికపై పవన్‌తోపాటు నాయకులు


మీ వెంటే..

జన పవనాలు!




అంతా ఓకేనా : నాదెండ్లతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్


అభిమానమే.. బలం : జయకేతనం సభ వేదికపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్


జన సైనికులమే : సభా వేదికపై ఆశీనులైన మహిళలు.. ఇతర నాయకులు


ఎగసిపడిన పవన్ అభిమానం



జనసైనికులే జనసేన బలం

- బంధం.. అనుబంధం మీరే
- మీ అందరి శ్రమతోనే అధికారంలోకి..
- వైసీపీ అరాచకాలను బద్దలు కొట్టాం
- మమ్మల్ని మీరే క్రమశిక్షణలో ఉంచాలి
- చిత్రాడ సభలో పవన్ కల్యాణ్
- అంచనాలకు మించి జనం
- మధ్యాహ్నానికే నిండిన వేదిక
- చోటులేక బయట వేలల్లో
- అదిరిపోయిన ఏర్పాట్లు
- వహ్వా అనిపించిన ఆతిథ్యం
- తరలివచ్చిన మహిళలు
- తీవ్ర ఎండతో ఇబ్బందులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

చిత్రాడ దద్దరిల్లింది.. జన సందోహంతో గర్జించింది.. అంచనాలకు మించి తరలివచ్చిన జనంతో పోటెత్తింది.. ఆవిర్భావ సభ పండగను సంతరించుకుంది.. కనుచూపుమేరలో జనం..కళ్లు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్.. వేలల్లో బారులు తీరిన బస్సులు.. కార్లు.. కనివినీ ఎరుగని ఏర్పాట్లతో నభూతో నభవిష్యత్తు అనే తరహాలో జయకేతనం సభ జయజయ ధ్వానాలతో దద్దరిల్లింది..అటు జనసేనాని పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో జనసైనికుల గురించే అధికంగా ప్రస్తావించి వారి మనసులు గెలుచుకున్నారు. పార్టీ నూరుశాతం స్ట్రైక్ రేట్ సాధించడంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడి అందరి గుండెలను తట్టారు. ఇన్నేళ్లలో ఎందరో జనసైనికులు పార్టీ సిద్ధాంతాల కోసం చనిపోయిన వైనాన్ని గుర్తుచేసి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. వెరసి జనసైనికులతోనే తన బంధం.. అనుబంధం అని వెల్లడించి పార్టీ క్యాడర్ తన దృష్టిలో ఎంత గొప్పస్థానం దక్కించుకున్నారో వివరించి అందరితో చప్పట్లు కొట్టించుకున్నారు. అటు చిత్రాడ సభ కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. అంచనాలకు మించి జనం భారీగా తరలి రావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నానికే కిక్కిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా దారులన్నీ చిత్రాడవైపే కదలడంతో కత్తిపూడి నుంచి కాకినాడ వరకు 216హైవే ఇసుకేస్తే రాలనంతగా మారిపోయింది.మహిళలు.యువత.రైతులు.. ఇలా అన్ని వర్గాలు సభకు హాజరవడం కన్నులపండువగా కనిపించింది. అటు పవన్ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు డిప్యూటీ సీఎంగాను,పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రిగా సాధించిన విజయాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.పవన్ కోసం జనం ఉదయం నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో మూడు ప్రవేశద్వారాలు కిక్కిరిసిపోయాయి. అటు పోలీసులేమో మధ్యాహ్నం 12గంటల నుంచే లోపలకు అనుమతించడంతో జనం ఆరుబయటే ఎండలో ఉండిపోయారు.ఆ తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకే సభలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. దీంతో వేలాది జనం బయటే ఉండిపోయారు. చాలా మంది వద్ద వీవీఐపీ, వలంటీర్ల పాసులు ఉన్నా పోలీసులు లోపలకు పంపకపోవడంతో చాలాసేపు వాగ్వాదం జరిగింది. అటు ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కానీ అంచనాలకు మించి తరలివచ్చిన జనం ఎక్కడా ఎండకు భయపడకుండా రాత్రి పదిన్నర వరకు సభలోనే ఉండిపోయారు.


విజయకేతనమే..


పవనే..మా నాయకుడు

4:30 గంటలకు పవన్..

పవన్‌కల్యాణ్ సరిగ్గా 4.30గంటలకు సభా ప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అనంతరం సభా వేదిక పక్కనే ఉన్న ప్రత్యేక బసలోకి వెళ్లి తిరిగి స్టేజీ మీదకు రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. ఈలోపు చాలాసేపు మంత్రి నాదెండ్లతో భేటీ అయ్యారు. అటు పవన్ వచ్చిన హెలికాప్టర్ సాయంత్రం ఐదుగంటలకు కాకినాడ వెళ్లింది. సభ ముగిసిన తర్వాత పవన్ కాకినాడలో జేఎన్టీయూ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. తిరిగి శనివారం ఉదయం పవన్ హెలికాప్టర్‌లో అమరావతికి బయలుదేరనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సభలో జనసేన ఎంపీ ఉదయ శ్రీనివాస్, మంత్రి దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. పవన్ తన ప్రసంగంలో ఎక్కడా పిఠాపురం నియోజవకర్గం గురించి ప్రత్యేకంగా ప్రస్తావన తేలేదు.అనేక విస్తృత అంశాలపై అనర్గళంగా ప్రసంగించడంతో సభకు వచ్చిన వారంతా చప్పట్లతో పవన్‌ను అభినందించారు. పవన్ సైతం సభను సక్సెస్ చేయడానికి శ్రమించి, సహకరించిన కాకినాడ కలెక్టర్,ఎస్పీతోపాటు పోలీసులను అభినందించారు.సినిమాలనుంచి తన రాజకీయ ప్రస్థానం వరకు కూలంకషంగా చర్చించడం అభిమానులను అలరించింది. జనసేనకు అధికారం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్న విషయాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రసంగం మధ్యలో పవన్ అని జనం అరుస్తుండడంతో.. కొంత అసహనం చెందిన పవన్ నా పేరు అరుస్తున్నారు.. అంటే.. నా ప్రసంగం వినడం లేదని అర్థం అని చురకలు అంటించడంతో జనసైనికులు ప్రసంగంపై దృష్టిసారించారు. జగన్‌లా తాను కోడికత్తి రాజకీయాలు చేయడం లేదని సైద్ధాంతిక రాజకీయాలు చేస్తున్నాని గుర్తుచేశారు.పదేళ్లలో పడ్డాం..నిలబడ్డాం అని పేర్కొని జనసేన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో యువ నాయకులను తయారు చేయడమే లక్ష్యంగా జనసేన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సభ ముగిసిన తర్వాత జనం తిరిగి స్వస్థలాలకు తిరిగి వెళ్లే సమయంలో వారందరికీ భోజన వసతిని పార్టీ సమకూర్చింది.అంచనాలకు మించి వచ్చిన జనానికి ఎక్కడా భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆతిథ్యం వహ్ వా అనేలా చేసింది. అటు రాష్ట్రస్థాయి సభ చిత్రాడలో జరుగుతుండడంతో ఊరి గురించి ప్రతి ఒక్కరూ ఆరా తీయడంతో గూగుల్‌లో ట్రెండింగ్‌గా మారింది. హోటళ్లు, రెస్టారెంట్లు భారీగా కిక్కిరిశాయి.




ఏ తరమైనా..అభిమానమే..


అభిమాన హారతి..

మా గురుతు.. పవన్..






అదిరే ఆతిథ్యం : కాకినాడ నుంచి చిత్రాడ వరకూ పలుచోట్ల ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్యాహ్నం.. సాయంత్రం కూడా బిర్యానీ.. భోజనాలు అందించారు.


జై..జై.. జనసేన

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు.. మృతుల స్వస్థలం మండపేట

7

రంజాన్	ఇఫ్తార్ (శని)	సా.6.21
వేళలు	సహరి (ఆది)	ఉ.4.50

డిప్యూటీ సీఎంకు కలెక్టర్ స్వాగతం


జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జనసేన ఆవిర్భావ సభ అనంతరం రాత్రి కాకినాడ జేఎన్‌టీయూకేలో బస చేయాల్సి ఉండగా.. వేదిక మారింది. కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్‌లో ఆయన రాత్రి బసకు విచ్చేశారు. కాగా, ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

నేడు ఉమ్మడి జడ్పీ సర్వసభ్య, బడ్జెట్ సమావేశాలు

7

ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజ

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

కన్న తండ్రే కాలయముడై..

- ఇద్దరు కుమారుల్ని క్రూరంగా చంపి ఆత్మహత్యకు పాల్పడిన నాన్న
- కుప్పకూలిన తల్లి
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

7

కూతురి బాధ.. అప్పుల వ్యథ!

- తట్టుకోలేక గోదారిలో దూకేసిన దంపతులు
- మృతదేహాల గుర్తింపు

7

నేటినుంచి స్వచ్ఛంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమం

- ప్రతినెలా మూడో శనివారం నిర్వహణ
- కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో స్వచ్ఛాంధ్రా -స్వర్ణాంధ్ర కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్ యార్డులు, ఆర్టీసీ బస్టాండ్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..


చిత్రాడదారులన్నీ జనపవనమై..

పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.




వీరమహిళల ఆనందోత్సాహం


మైక్ స్టాండ్‌లపైనా జనసైన్యం


జనసేన సభ ఎక్కడుంటే అక్కడే ఉంటా



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాములును సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్


తిరుగు ప్రయాణంలో..


స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొడుతున్న జన సైనికులు

సభ విజయవంతం కావాలని 108 కొబ్బరికాయలు కొట్టారు!

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు వచ్చిన జన సైనికులు కొబ్బరికాయలు కొట్టారు. కోనసీమ ప్రాంతం నుంచి వచ్చిన ఈ జన సైనికులు సభ సమీపంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి జనసేన ఆవిర్భావ సభ విజయవంతంగా సాగాలని కోరుకున్నారు.



జనశ్రేణులకు ఎండదెబ్బ

పిఠాపురం/కలెక్టరేట్ (కాకినాడ) మార్చి 14(ఆంధ్రజ్యోతి): జన సైనికులను ఎండ తీవ్రత ఇబ్బందులకు గురిచేసింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండతీవ్రత గణనీయంగా ఉంది. మధ్యాహ్నానికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలుగా నమోదైంది. చిత్రాడ శివారులోని జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12 గంటలకే చేరుకున్న వారికి ఎండతీవ్రత చుక్కలు చూపించింది. సభా ప్రాంగణంలోకి వచ్చిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఎండ నుంచి కాపాడుకునేందుకు అట్టలు, పేపర్లు అడ్డుగా ఉంచుకున్నారు. పలువురు ఫ్లెక్సీలను నెత్తిన పెట్టుకుని ఎండ తీవ్రత నుంచి కాపాడుకునే ప్రయత్నం చేశారు. చెట్ల కింద కూర్చుని ఉపశమనం పొందారు. సాయంత్రం వరకూ ఇదే రీతిలో ఉష్ణోగ్రతలు కొనసాగాయి. దీంతో సభకు వచ్చినవారు తాగునీరు,మజ్జిగ తాగుతూ తీవ్రత తగ్గించుకునే ప్రయత్నం చేశారు.


అస్వస్థతకు గురైన వలంటీర్ కె.దుర్గాలక్ష్మి

పదిమందికి పైగా అస్వస్థత

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభలో అపశృతి చోటు చేసుకుంది. సభకు వచ్చిన పలువురు ఎండతీవ్రత, ఉక్కపోత భరించలేక అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఉక్కపోత ఉండడంతో ఒకరిద్దరు స్పృహ కోల్పోయారు. సభలో వలంటీర్‌గా పనిచేసేందుకు వచ్చిన తెనాలికి చెందిన కె.దుర్గాలక్ష్మి, బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన రాజమహేంద్రవరం కానిస్టేబుల్ కె.దేవి, సత్యవతి, ఎం.రాధాకృష్ణ సహా పదిమంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

ముఖ్య నేతలు ఎవరేమన్నారంటే...

- కలెక్టరేట్ (కాకినాడ)

విప్పటం సభలో వేటకు వెళుతున్న సింహంలా..

విప్పటంలో జరిగిన సభలో వేటకు వెళుతున్న సింహంలా పవన్‌కల్యాణ్ కన్పించారు. ఈ 12వ ఆవిర్భావ సభకు వస్తుంటే గుంటనక్కలను వేటాడి వచ్చిన సింహంలా పవన్ కనిపిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కృషి వల్లే ఈరోజు రాష్ట్రంలో జలజీవన్ మిషన్ కింద నిధులు విడుదల అవుతున్నాయి. గత పాలకులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన జలజీవన్ మిషన్ నిధులు నిర్వీర్యం చేశారు. **- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్**

మోదీ అంత క్రేజ్ పవన్‌ది..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఓడిపోయినా ఢీలా పడలేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో విజయం సాధించాం. దేశంలో నరేంద్రమోదీ తర్వాత అంతటి క్రేజ్ పవన్‌కు ఉంది.

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సొంత డబ్బు కౌలు రైతులకు ఇచ్చారు

పవన్ సొంత డబ్బు పంపిణీ చేసి కౌలు రైతులను ఎంతో ఆదుకున్నారు. జనవాణిలో వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించి వారి మనస్సులో నిలుస్తున్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడానికి పవన్ ఎంతో శ్రమించారు. మత్స్యకారులకు నష్టం కల్గించే జీవో రద్దు చేశారు.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు నష్టం కల్గించే 217 జీవోను పవన్‌కల్యాణ్ రద్దు చేయించారు. ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

గిరిజనుల అభివృద్ధికి కోసం కృషి

అప్పట్లో బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. మన్యం జిల్లాలో రోడ్ల అభివృద్ధికి పవన్ కృషి చేస్తున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

గత ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం. అయినప్పటికీ అధైర్యపడకుండా పనిచేసి పవన్ సారథ్యంలో విజయం సాధించాం. మన కర్తవ్యం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే.

- నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి

పవన్‌కల్యాణ్ కారణజన్ముడు

పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కారణజన్ముడు. అందుకే తను పుట్టినప్పుడు తన మాతృమూర్తికి నొప్పులు లేవు. పవన్ స్వార్థం లేకుండా రాజకీయాలు చేశారు. ఆదాయం వచ్చే సినిమాలు వదిలేసి ప్రజల కోసం పోరాటాలు చేసి ప్రజల కోసమే అధికారంలోకి వచ్చారు.

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పవన్ పోరాటంతోనే ఎన్నికల్లో నెగ్గాం

కేవలం ఒక వ్యక్తి పవన్ పోరాటంతోనే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ నెగ్గాం. పవన్ కల్యాణ్ పోరాటాల వల్ల అధికారంలోకి వచ్చాం. తొమ్మిది నెలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాం.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా

తాను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకానని అనగానే సభలో నవ్వులు విరిశాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆదర్శంతో జనసేన పార్టీ ఆవిర్భయించింది. వందేళ్ల క్రితం అల్లూరు సీతారామరాజు బ్రిటిష్ దొరలను గడగడలాడించారు. మరళా ఇప్పుడు పవన్ వైసీపీ నియంతలను గడగడలాడించారు. జగన్‌రెడ్డి మీకు ఇంకా జనసేన ఎందుకు పుట్టిందో అర్థంకాలేదా అని ప్రశ్నించారు.

- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

పవన్‌తోనే సాధ్యం

పవన్ సారథ్యంతోనే జనసేన అఖండ విజయం సాధించింది. గత ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశాం. చివరకు కూటమిగా జతకట్టి విజయం సాధించాం. పేదలకు సేవ చేయడానికే పవన్ పార్టీ పెట్టారు.

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

జగన్ తెలుగుకు ఎక్కువ.. ఇంగ్లీషుకు తక్కువ

వైసీపీ నేత జగన్ తెలుగుకు ఎక్కువ, ఇంగ్లీషుకు తక్కువ. పవన్‌కల్యాణ్‌కు నాలుగైదు భాషలు మాట్లాడతారు. జగన్‌కు కనీసం తెలుగు, ఇంగ్లీషులో కూడా పరిజ్ఞానం లేదు. జగన్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల వల్లే ఆ పార్టీ కేవలం 11 సీట్లుకే పరిమితం అయ్యింది. **- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి**

భవిష్యత్తులో వైసీపీ కనుమరుగు

గత 11 ఏళ్లు పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఆవిర్భావ సభలు జరుపుకున్నాం. ఇప్పుడు పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు అభిమానుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో వైసీపీ కనుమరుగవడం ఖాయం.

- కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి

అడుగులన్నీ అటువైపే..

ఆవిర్భావ వేడుకకు తరలివచ్చిన జనసైన్యం

కాకినాడ- పిఠాపురం రహదారిపై భారీ జనసందోహం.. జనసైన్యాన్ని అదుపు చేయలేక పోలీసుల కష్టాలు

పిఠాపురం/ కాకినాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అన్నిదారులు ఆవిర్భావ సభ వైపే. చిత్రాడకు వచ్చే మార్గాలన్నీ జనసంద్రమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ 216వ జాతీయ రహదారితోపాటు అన్ని రోడ్లు ప్రజలు, వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3 గంటలకే నిండిపోవడంతో ఎక్కడిక్కడ రహదారుల వెంబడి వాహనాలు నిలిపివేశారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సభ ముగిసిన తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్‌తోపాటు పిఠాపురం-సామర్లకోట, ఉప్పాడ-పిఠాపురం, విరవాడ-కోలంక-పిఠాపురం, గోర్స-పిఠాపురం, తిమ్మాపురం-పిఠాపురం, చంద్రపాలెం-చిత్రాడ, నాగులాపల్లి-మాధవపురం-పిఠాపురం సహా అన్ని రోడ్లు వాహనాలతో కిక్కిరిసి కనిపించాయి. చిత్రాడ సభా ప్రాంగణానికి సమీపంలో కాకినాడ వైపు ఏర్పాటు చేసిన అయిదు, పిఠాపురం వైపు ఏర్పాటుచేసిన నాలుగు పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3గంటలకే నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు, కార్లు, వేన్‌లు, ఇతర వాహనాలకు నిలిపే చోట్లు లేకపోవడంతో జాతీయరహదారి, చిత్రాడ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై నిలిపివేశారు. ట్రాఫిక్ సైతం కిలోమీటర్ల మేర నిలిచిపోయింది.


జ్యోతి ప్రజ్వలన

మామిడికుదురులో ఓఎన్జీసీ పైపులైను లీకేజీ


లీకవుతున్న గ్యాస్ పైపులైను

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడి ఓఎన్జీసీ స్ట్రక్చర్‌లో గల పైపులైను మామిడికుదురులో గురువారం స్వల్పంగా లీకైంది. గ్రామంలోని ఏటిగట్టు శివారు ప్రాంతంలో గల వరి చేలలో లీకేజీ ఏర్పడింది. పాశర్లపూడి 43 బావి నుంచి నగరం జీసీఎస్ వరకు ఏర్పాటుచేసిన పైపులైను నుంచి లీకేజీ ఏర్పడినట్టు సంబంధిత అధికారులు గుర్తించారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో తెల్ల నురగతో పాటు ముడిచమురు తెట్టుగా రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో ముడిచమురు వాసన వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రెండు పర్యాయాలు లీకేజీ సంభవించిందని అధికారులు తూతూ మంత్రంగా లీకేజీ అరికట్టి చేతులు దులుపుకుంటున్నారని సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గర్భిణి మృతి


ధనకుమారి (ఫైల్)

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ చింతావానిరేవులో శుక్రవారం ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతిచెందింది. చింతావానిరేవుకు చెందిన రేకాడి ధనకుమారి (25) వాటర్ హీటర్‌ను స్విచ్ బోర్డులో పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త రేకాడి కనకరాజు కర్రివానిరేవు గ్రామ పంచాయతీ పరిధి 10వ వార్డు సభ్యుడు. ఒక కుమార్తె ఉండగా ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. ధనకుమారి భర్త కనకరాజు చేపలవేట వృత్తి చేసుకుంటున్నాడు. ధనకుమారి మృతితో ఆకుటుంబంలో విషాదం నెలకొంది.

ఇద్దరు నకిలీ విలేకర్లపై కేసు

మండపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విలేకర్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన ఇద్దరిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన చంద్రమళ్ల రవీంద్ర కోళ్లపెంటను వాహనంలో తీసుకువెళుతుండగా మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి తాము విలేకర్ల మంటూ మండపేటకు చెందిన పెనుముచ్చి సుకుమార్, రాయవరం మండలానికి చెందిన పెంకే వంశీ వ్యాన్‌ను ఆపారు. లారీ రికార్డును తీసుకురావాలని కోరారు. వ్యాన్ కదలాలంటే తమకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇచ్చేందుకు రవీంద్ర నసేమి రా అననంతో స్టేషన్‌కు పదాఅంటూ వ్యాన్‌ను మండపేట పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. స్టేషన్‌కు వచ్చిన తర్వాత జరిగిన సంఘటన అంతా డ్రైవర్ రవీంద్ర పట్టణ సీఐ సురేష్‌కు వివరించారు. దానిపై సీఐ నకిలీ విలేకర్లను వాహనం ఎందుకు ఆపారు అంటూ ప్రశ్నించారు. దానికి వారు నీళ్ల నమిలారు. డ్రైవర్ ఫిర్యాదుపై సుకుమార్, వంశీలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎవరైనా విలేకర్ల ముసుగులో నకిలీ దందాలు చేస్తే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

శాస్త్రోక్తంగా నారసింహుని చక్రస్నానం


స్వామివారి అద్దపు సేవ దృశ్యం

- కోరుకొండలో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు


చక్రస్నానం దృశ్యం

కోరుకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కోనేరు వద్ద చక్రస్నానం ఆగమ పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, కోరుకొండ దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దిగువ దేవస్థానం వద్ద స్వామికి సేవాకాలం నిర్వహించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామివారిని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేర్వేరు పల్లకీలలో ఆశీనులు గావి ంచారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య పల్లకీలు దిగువ దేవస్థానం నుంచి గిరి ప్రదక్షిణగా దేవుని కోనేరు వద్దకు చేరుకున్నాయి. అక్కడ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, శ్రీభూ సమేత అనంత పద్మనాభస్వామి వారి సమక్షంలో ఆగమ బ్రహ్మాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యు లు, అనువంశక అర్చక స్వాములు పెదపాటి గిరిధరాచార్యులు, సంతోషకుమార్ ఆచార్యులు ఈ చక్ర పెరుమాళ్ళకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీ చక్రపెరుమాళ్ళకు పంచామృత అభిషేకాలు చేసి దేవుని కోనేటిలో చక్రస్నానం చేయించారు. అనేక మంది పండితులు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు వందలాది మంది భక్తులు, స్వామివారితో కలిసి దేవుని కోనేటి చక్రస్నానం చేశారు. అనంతరం స్వామి వారికి అర్చన, సేవాకాలం, తీర్థగోష్ఠి జరిగింది. తదుపరి భక్తుల గోవిందనామస్మరణ మధ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు అనంతపద్మనాభ స్వామి వారు శ్రీచక్రపెరుమాళ్ళతో దేవాలయానికి చేరుకున్నారు.

శేషవాహనంపై గ్రామోత్సవం

అలాగే విశేష పుష్ప అలంకరణలతో స్వామి,అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులైరాత్రి 9గంటలకు గ్రామోత్సవం చేశా రు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ స్వామివారి శేషవాహనాన్ని కోరుకొండ నాలుగు మాడవీధుల్లో తిప్పారు. ఆ వాహనం తమ ఇళ్ల ముందుకు వచ్చినప్పుడు భక్తులు స్వామివారికి ఫలాలు, పుష్పాలు మంగళనీరాజనాలు అందజేశారు. ఉత్సవాలు ముగింపు రోజు చివరి రోజు శేషవాహనాన్ని తిలకించి పులకించారు.

ముగిసిన పండిత సభలు

శ్రీ రంగరాజ స్వామి వారి ఆలయ సన్నిదిలో గత 5 రోజులుగా సాగుతున్న 93వ విశిష్టాద్వైత పండిత సభలు శుక్రవారం రాత్రి 8గంటలతో వైభవంగా ముగిశాయి. సభా అధ్యక్షులు పరా సర లక్ష్మీనరసింహ భట్టర్ ఆధ్వర్యంలో ఉభయ వేదాంత పండితులు సాతులూరి వెంకట శ్రీనివాస్ కల్యాణ చక్రవర్తి, మార్గపూరి రంగాచార్య స్వాములు ఉపన్యసించారు. అనేక భగవద్ విషయాలను భక్తులకు వివరించారు. అదే విధంగా నరసింహస్వామివారి అనువంశకధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ స్వామి, రఘునాథ భట్టర్ స్వామి, మహిళా పండితులు ఉభయ వేదాంత పండిత సభల్లో పలు విషయాలను వివరించారు. పరాసర లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో పండితులకు సత్కారం జరిగింది.


పండిత సభలో పాల్గొన్న లక్ష్మీ నరసింహభట్టర్, పండితులు

వైభవంగా అద్దపు సేవ

నరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణ వేదికపై స్వామివారికి విశేష ఫలపుష్ప అలంకరణల మధ్య అద్దపు సేవ అనబడే ఊంజలసేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులు గావించి ఈ సేవ చేపట్టారు. స్వామికి ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో వేలాదిమంది భక్తులు అద్దంలో దర్శించుకున్నారు. అంతకుముందు ధ్వజ అవరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటిండెంట్ వాసు, రాంజీ, నాగరాజు, ఇతర అధికారులు, పెద్దింటి చంటిబాబు ఆచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, పెదపాటి గిరిధరాచార్యులు, గోవర్ధనం తిరుమలాచార్యులు, పెరవళి వంశీఆచార్యులు, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ వీరగణేష్, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పూజలు


అన్నవరంలో జస్టిస్ శ్రవణ్‌కుమార్‌కు సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

భీమేశ్వరాలయంలో...

ద్రాక్షారామ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

నేడు ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య, బడ్జెట్ సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ, బడ్జెట్ సమావేశాలు శనివారం జరగనున్నాయి. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, మూడు జిల్లాల అధికారులు పాల్గొంటారు.

కన్న తండ్రే కాలయముడై..

ఇద్దరు కుమారుల్ని క్రూరంగా చంపి ఆపై ఆత్మహత్యకు పాల్పడిన నాన్న

- కుప్పకూలిన తల్లి
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హోలీ రోజున కాకినాడలో దారుణం


ఫ్యానుకి ఉరేసుకున్న చంద్రకిషోర్


ఫైల్ ఫొటో

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా హోలీ వేడుకల్లో ఆనందోత్సాహాల్లో మునిగి ఉన్నారు. ఇద్దరూ చిన్నారులు కూడా హోలీ పండుగలో తల్లిదండ్రులతో కలిసి పాల్గొనేందుకు వెళ్తున్నామని సంబరపడ్డారు. కానీ ఇదే తమకు ఆఖరి పండుగ అనే విషయం ఆ చిన్నారులకు తెలియదు. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే కాలయముడిలా మారి ఇద్దరిని అతి పాశవికంగా కాళ్లు,చేతులు కట్టేసి నీళ్ల బకెట్టులో ముంచి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం తానూ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోటీ ప్రపంచంలో తన పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే తన పిల్లల్ని చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సూసైడ్ నోటు రాసి మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకెళితే తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) భార్య తనూజాతో కలసి కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్ రోడ్డు నెంబర్ -2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్‌లో ప్లాట్ నెంబర్ 202లో తొమ్మిదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. కాకినాడ రూరల్ వాకలపూడి ఓఎన్‌జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఇద్దరు సంతానం కాగా, వారిలో పెద్ద కుమారుడు వానపల్లి జోషిల్ (7), రెండో కుమారుడు నిఖిల్ (6)లు లిటిల్ ఉడ్స్ స్కూల్లో ఒకటో తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. శుక్రవారం ఉదయం ఓఎన్‌జీసీ కార్యాలయంలో హోలీ వేడుకలు చేసుకునేందుకు భార్య, ఇద్దరు పిల్లలతో కలసి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన 10 నిమిషాలు అయిన తర్వాత కుమారులు ఇద్దరికీ యూనిఫామ్ కుట్టించేందుకు టైలర్ వద్దకు తీసుకువెళుతున్నానని చంద్ర కిషోర్ భార్యకు చెప్పి కుమారుల్ని వెంట తీసుకుని వెళ్లాడు.

పది నిమిషాల్లో వస్తానని చెప్పి...

పది నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఎంతకీ రాకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా 10 నిమిషాల్లో వచ్చేస్తానని భార్యకు చంద్రకిషోర్ బదులిచ్చాడు. ఎంతకీ భర్త ఇద్దరు పిల్లలతో రాకపోవడంతో కంగారు పడి భర్త ఆఫీసులో పని చేస్తున్న రామమూర్తిని ఇంటికి వెళ్లి చూసి రావాలని పంపించింది. అతడు వెళ్లగా ప్లాట్ డోర్లు లోపల నుంచి వేసి ఉండటంతో పలు సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బలవంతంగా కిటికీ గ్రిల్ ఓపెన్ చేసి లోపలికి వెళ్లి చూశాడు. చంద్రకిషోర్ బెడ్‌రూమ్‌లో ఫ్యానుకు ఉరేసుకోవడంతో విగతజీవిగా ఉండటాన్ని చూశాడు. పిల్లలు పక్కనే ఉన్న మరో బెడ్‌రూమ్‌లోని అటాచ్డ్ బాత్‌రూమ్‌లో పిల్లల చేతులు, కాళ్లు కట్టి వేసి, తలలను నీటితో నిండిన బకెట్లలో ముంచడంతో చనిపోయి ఉండటాన్ని పరిశీలించి చంద్రకిషోర్ భార్య, పోలీసులకు సమాచారం అందించాడు.

పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని...

అయితే చంద్రకిషోర్ సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. దీనిని పోలీసులు, భార్య వచ్చి పరిశీలించగా తన పిల్లలకు పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నట్టు ఆ నోట్‌లో ఉంది. పిల్లల్ని క్రూరంగా చంపి భర్త కూడా ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన భార్య కుప్పకూలిపోయింది. పిల్లలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లల్ని ఇలా ఎందుకు చంపేశావు అంటూ రోధించింది. ఆర్థిక ఇబ్బందులు ఏమీలేవని సొంత ప్లాటు, కారు, ఆస్తులు ఉన్నాయని మృతుడి అన్నయ్య తెలిపారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

పొగాకు బ్యారన్‌లో అగ్నిప్రమాదం

రూ.8 లక్షల ఆస్తినష్టం


యాదవోలులో మంటలను ఆర్పుతున్న ఫైర్ అధికారులు

దేవరపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలులో పొగాకు బ్యారన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. యాదవోలుకు చెందిన వలవల సత్యవతి బ్యారన్లను అదే గ్రామానికి చెందిన ముమ్మడి శ్రీనివాస్ అద్దెకు తీసుకుని పొగాకు క్యూరింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొగాకు క్యూ రింగ్ చేస్తుండగా ఆకులు బీడింగ్ గొట్టంపై పడడంతో మంటలు వ్యాపించి కలప పూర్తిగా దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు రైతులు, ఫైర్ అధికారులు గుర్తించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


సీతాపురంలో కాలిపోతున్న ఇల్లు

ఎటపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురం గ్రామంలో శక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. సీతాపురం గొల్లగూడెం రోడ్‌లోని కాటూరి వెంకట నర్సమ్మకు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికే ఇళ్లు మొత్తం దగ్ధమై గృహోపకరణాలు కాలిబుడిదయ్యాయి. నర్సమ్మ ఇంట్లోనే కొడుకు కాటూరి వెంకటేశ్వర్లు కుటుంబం కూడా కలిసి జీవిస్తున్నారు. 2 కుటుంబాలకు చెందిన సామగ్రి కాలిపోయింది. పక్కనే ఉన్న దారా దుర్గాప్రసాద్ చెందిన రేకుల ఇళ్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంటి ఆవరణలో ఉన్న అతడి ద్విచక్ర వాహనం కూడా మంటల్లో చిక్కుకుంది. సుమారు రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. ఫైరింజన్ అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది.

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్/మండపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన చిన్నారి సహా తల్లిదండ్రులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల పాపారావు రెండో కుమారుడు వెంకట సత్య సురేన్ (39) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య నవ్య(36), కుమార్తె వాసవీ కృష్ణ(4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. కుంచనపల్లి వచ్చేసరికి హైవే పనులు చేసేందుకు నిలుపుదల చేసిన లారీని కారు వేగంగా వచ్చి ఢీకొని తునాతునకలైంది. డ్రైవ్ చేస్తున్న సురైన్, నవ్య ఘటనా స్థలంలో మృతిచెందగా చిన్నారి వాసవి కృష్ణని తణుకు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ చనిపోయింది. శ్రీరమ్య కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.


మరణించిన కుటుంబసభ్యుల ఫైల్‌ఫొటో

మండపేటలో విషాదఛాయలు

సురేన్ కుటుంబ సభ్యులు ముగ్గురు దుర్మరణం పాలవడంతో ఆయన స్వస్థలమైన మండపేటలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఆయన రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఎంబీఏ చేశాడు. చాలాకాలం క్రితం హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు జాబ్ చేసుకుంటూ అక్కడే కుటుంబంతో ఉంటున్నాడు. అతడి భార్య నవ్య కె.గంగవరం మండలం యండగండి వాసి. వారి కుమార్తె వాసవితో కలిసి కారులో బయలుదేరి శనివారం మండపేటలో బంధువుల ఇంట జరిగే శుభ కార్యక్రమానికి, ఏడిదలో శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు హాజరయ్యేందుకు వస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. క్షేమంగా ఇంటికి చేరతారన్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజ

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజలో ఉందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అన్నారు. వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో కోయంబత్తూరులోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ కంపెనీ సహకారంతో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై జాతీయ స్థాయి ఎస్పార్క్స్-2025 టెక్నికల్ సింపోజియంలో భాగంగా శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. 3రోజులు తరగతులు జరుగుతాయి. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్, గౌరవ అతిథిగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్, ఐఓటీ, డేటాసైన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న తరగతులకు బి.లీలాకుమారి కన్వీనర్‌గాను, పి.పుష్పలత సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అధ్యాపకులు, అను బంధ కళాశాలల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు.

కూతురి బాధ..అప్పుల వ్యథ!

- తట్టుకోలేక గోదారిలో దూకేసిన దంపతులు
- మృతదేహాల గుర్తింపు

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక కాకినాడకు చెందిన దంపతులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తూరంగికి చెందిన కాళ్ల వెంకటరమణ(55) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య వరలక్ష్మి(50) చీటీలు వేస్తారు. చాలా కాలంగా నమ్మకంగా ఉంటున్నారు. దీంతో స్థానికులు కూడా ఎంతో నమ్మారు. ఈ క్రమంలో దాదాపు రూ.60 లక్షల వరకూ అప్పులు చేశారు. తమ సొంతింటిని విక్ర యించి రూ.45లక్షల వరకూ అప్పులు తీర్చారు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట ఒక్కగానొక్క కూతురు ప్రేమ వివాహం చేసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఒక వైపు కూతురి బాధ..మరో వైపు అప్పుల వాళ్లు పీడించడంతో మానసికంగా నలిగిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజమహేంద్రవరం పిండాల రేవుకు వచ్చి కూతురిని తలచుకుని బాగా రోధించారు. తర్వాత ఇద్దరూ గోదావరిలోకి దూకి ప్రాణాలు విడిచారు. తాము ఆర్థిక ఇబ్బందులతో చచ్చి పోతున్నామంటూ గోదా వరి గట్టుపై ఓ లెటర్‌ను ఉంచారు. తమ ఆధార్ కార్డులను కూడా అక్కడే పెట్టారు. స్థానికుల సమాచారం తో టూటౌన్ సీఐ మంగాదేవి ఆదేశాల మేరకు సిబ్బంది చేరుకుని గాలింపు చేపట్టారు. కొద్ది సమయంలో మృతదేహాలను గుర్తించారు. ఆధార్ కార్డుల ఆధారంతో వారి చిరునామా తెలుసుకుని బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శవ పరీక్షల అనంతరం మృతదేహాలను సంబంధీకులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి పేర్కొన్నారు.


వెంకటరమణ, వరలక్ష్మి మృతదేహాలు


ఇసుకలోడుతో లారీ వెళ్తుండగా కూలిన వంతెన

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలోని వంతెనపై నుంచి ఇసుకలోడుతో లారీ వెళ్తున్న సమయంలో వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో ఇసుకలోడు లారీ కాల్వలోకి దిగబడిపోయింది. లారీ దిగబడిపోయినప్పటికీ ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన పంటకాల్వపై ఉన్న ఈ వంతెన శిథిలస్థితికి చేరడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. శిథిలమైన వంతెన గురించి చాలాకాలంగా స్థానికులు భయపడుతున్నారు. శుక్రవారం ప్రమాదం జరిగి ఏవిధమైన ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



జనసేన ఆవిర్భావ సభ

సైడ్ లైట్స్....



స్వాగతం... సుస్వాగతం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ నేపథ్యంలో ఫ్లెక్సీలు, బ్యానర్లను కిలోమీటర్ల మేర ఏర్పాటు చేశారు. కాకినాడ సిటీ, భానుగుడి సెంటర్, సర్పవరం జంక్షన్, ఏపీఎస్పీ, ఏడీబీ రోడ్డు, తిమ్మాపురం, పండూరు చెరువు, పి.వెంకటాపురంల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టారు. అన్నవరం నుంచి కత్తిపూడి, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, చిత్రాడ వరకు స్వాగత బ్యానర్లు దర్శనమిచ్చాయి.



గుర్రంపై వచ్చి...

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణానికి చెందిన న్యాయవాది ముమ్మిడి రామకృష్ణ జనసేన ఆవిర్భావ సభకు గుర్రంపై వచ్చి అందరి దృష్టినీ ఆకర్షించారు. గురువారం గుర్రంపై తిరుగుతూ ఆవిర్భావ సభకు తరలిరావాలని ప్రచారం నిర్వహించిన ఆయన శుక్రవారం సభకు గుర్రంపై వచ్చారు.

హోటళ్లు, లాడ్జిలు ఫుల్

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన జయకేతనం సభకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో కాకినాడ కిక్కిరిసింది. నగరంలోని ప్రధాన హోటళ్లతో పాటు, లాడ్జీలన్నీ నిండిపోయాయి. తగినన్ని గదులు దొరక్కపోవడంతో సభకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు పిఠాపురం, అన్నవరం, కత్తిపూడి, తిమ్మాపురంల్లోని లాడ్జీల్లో బస చేశారు. కొంత మంది అభిమానులు, కార్యకర్తలు ఈనెల 12వ తేదీనే చేరుకుని రెండు రోజులు వున్నారు. పలు లాడ్జీల్లో గదుల ధరలను రెట్టింపు చేసి అద్దెకు ఇచ్చారు. కొంత మందికి ప్రభుత్వ వసతిగృహాల్లో ఆతిథ్యం ఇచ్చారు.



ఆరోగ్య శిబిరాల ఏర్పాటు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణం నలువైపులా వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 40 డిగ్రీల ఎండ వేడిమితో డీహైడ్రేషన్‌కు గురైన నాయకులు, కార్యకర్తలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉచితంగా అందజేశారు. గొల్లప్రోలు, నాగులాపల్లి, మల్లం, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు సేవలందించారు. కాకినాడ నుంచి వచ్చిన వైద్య బృందం కూడా పర్యవేక్షించింది. వైద్యులు సునీత, మానస, సత్యసాగర్, స్వర్ణలత తదితరులు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆలయాలు కిటకిట

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన జనసేన నాయకులు, జన సైనికులు, వీరమహిళలు పట్టణంలోని పాదగయ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, కుంతీ మాధవస్వామి ఆలయం, అనఘా దత్తక్షేత్రంలకు వచ్చి పూజలు చేశారు. అన్నదానాలకు పోటెత్తారు.

'దూసర్లపూడి' నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజాహిత వెతలపై స్పందించాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు 8 అంశాలతో కూడిన ఫ్లెక్సీతో గాంధేయ మార్గంలో నిరసన తెలిపారు. కాకినాడ కార్పొరేషన్లో 8 గ్రామాల విలీనం, కార్పొరేషన్ ఎన్నికలు, ఆర్థిక సంఘం నిధులు, ముంపునకు గురవుతున్న కాకినాడ-సామర్లకోట హైవే కెనాల్స్ ఉప్పుటేరు ప్రక్షాళన, అనారోగ్యకర కోనోకార్పస్ వృక్షాల తొలగింపు, ఉప్పాడ తీరంలో రక్షణ గోడ, మడ అడవుల పెంపకం, సంరక్షణ అంశాలను ఫ్లెక్సీలో పొందుపర్చారు.

17న 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో ఈ నెల 17వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికులు 99592 25534 నెంబరుకు ఫోను చేసి డిపో మేనేజరుకు తమ సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు.





కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి మోటారు సైకిళ్లపై చిత్రాడ తరలివెళ్తున్న జన సైనికులు, సామర్లకోటలో జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)

జయకేతనం సభకు తరలిన జనసైనికులు

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ సభకు వేలాది మంది జనసైనికులు, వీర మహిళలు చిత్రాడ తరలివెళ్లారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కాకినాడ రూరల్, కరప మండలం, అర్బన్ పరిధిలోని 7 డివిజన్ల నుంచి 200 బస్సులు, 100 టాటా ఏస్‌లు, 200 ఆటోలు, రెండు వేల బైక్‌లపై ర్యాలీగా గొడారిగుంట, వలసపాకల, సర్పవరం జంక్షన్, అచ్చంపేట సెంటర్ మీదుగా చిత్రాడ వెళ్లారు. వారికోసం ఎమ్మెల్యే నానాజీ ఉప్పలంక, కాకినాడల్లో ప్రత్యేకంగా చికెన్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, మజ్జిగ ప్యాకెట్లు, మంచినీటి సీసాలు తయారు చేయించారు. ఆహార ప్యాకెట్ల పంపిణీ, వాహనాల సరఫరా బాధ్యతను ఎమ్మెల్యే తనయుడు సందీప్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ని స్వయంగా వీక్షించేందుకు నియోజకవర్గం నుంచి సుమారు 35 వేలమంది వెళ్లినట్టు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ... జయకేతనం సభకు సామర్లకోట పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి జనసైనికులు జనసేన జెండాలు చేతబూని ద్విచక్ర వాహనాలు, కార్లలో చిత్రాడ తరలివెళ్లారు. ర్యాలీ అగ్రభాగాన జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) ఓపెన్ టాప్ వాహనంలో నిలుచుని ప్రజలకు అభివాదం చేశారు. అంతకు ముందు సామర్లకోటలోని జనసేన కార్యాలయం ఎదుట పార్టీ జెండాను బాబు ఆవిష్కరించి పలువురికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సరోజా వాసు, మంచెం సాయిబాబు, వగ్రే సతీష్, కందా రమేష్, జానకిరామారావు, ఆరిమిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.





ప్లకార్డులు ప్రదర్శిస్తూ బస్సులో జనసేన ఆవిర్భావ సభకు వెళ్తున్న తమ్మవరం రైతులు

డిప్యూటీ సీఎం సార్... న్యాయం చేయండి

పవన్‌కల్యాణ్‌కు తమ్మవరం రైతుల వినతి

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'డిప్యూటీ సీఎం సార్... పవన్ కల్యాణ్ గారూ... మాకు న్యాయం చేయండి... మా భూములను ఏపీఐఐసీ ఎక్విజేషన్ నుంచి డీ నోటిఫికేషన్ చేయించండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ రెండు బస్సుల్లో బయల్దేరి చిత్రాడలోని జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్లారు తమ్మవరం గ్రామ రైతులు. కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో మూడు పంటలు పండే సర్వే నెం.41/11, 42,43ల్లో ఉన్న సుమారు 295 ఎకరాల భూములను 1999లో ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించింది. ఎకరాకు రూ.80వేలు పరిహారం ఇస్తామని అప్పట్లో పేర్కొనగా.... పరిహారం చాలదని భూములిచ్చేందుకు అంగీకరించలేదని పలువురు రైతులు తెలిపారు. ఈ విషయమై కోర్టుకు వెళ్లారు. ఏళ్ల తరబడి భూములు తమ ఆధీనంలో ఉన్నప్పటికీ యాజమాన్య హక్కులు లేకపోవడంతో భూముల క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండాపోయింది. ఎన్నికల సమయంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను డీ నోటిఫై చేయిస్తామని హామీలు ఇచ్చిన రాజకీయ నాయకులు తర్వాత భూములను వెనక్కి ఇప్పించడంలో పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలోనే రైతులకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలసి కూటమి అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించామన్నారు. ఏపీఐఐసీ నుంచి భూముల సమస్యల పరిష్కారం కోసం రెండున్నర దశాబ్దాలుగా కోర్టులు, రాజకీయ పార్టీల చుట్టూ తిరిగి నలిగిపోతున్నామన్నారు. తమ్మవరం భూములపై డిప్యూటీ సీఎం దృష్టిసారిస్తే ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ఉన్నామని గొల్లపల్లి వెంకటరమణ చెప్పారు. ఏపీఐఐసీ నుంచి డీ నోటిఫై చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.



శిక్షణ ముగింపు సభలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

'వైద్య ప్రమాణాల ఎదుగుదలకు ఎన్ఈఎల్ఎస్ శిక్షణ దోహదం'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో నూతనంగా నిర్మితమైన స్కిల్ ల్యాబ్‌లో ఐదు రోజులు జరిగిన నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ (ఎన్ఈఎల్ఎస్) శిక్షణ శుక్రవారం ముగిసింది. డీఎంఈ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి గౌరవ అతిథిగా హాజరయ్యారు. అనస్థీషియా హెచ్‌వోడీ, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణకు నోడల్ ఆఫీసర్‌గా అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ వింధ్య వ్యవహరించారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య ప్రమాణాల ఎదుగుదలకు ఎన్ఈఎల్ఎస్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన 25 మంది వైద్య నిపుణులు హాజరయ్యారన్నారు. డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ వింధ్యలను డీఎంఈ నరసింహం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, అనస్థీషియా వైద్యులు డాక్టర్ పర్వీన్, డాక్టర్ అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ నగరంలో హోలీ వేడుకలో యువకులు, రంగ్ ఉత్సవ్‌లో పాల్గొన్న రంగరాయ వైద్య కళాశాల విద్యార్థినులు

హోలీ... రంగోలీ... ఆనంద కేళి

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ... ఆనంద కేళి అయ్యింది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువతీ, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగుల నీళ్లు చల్లుకుని సందడి చేశారు. దేవాలయం వీధిలో మార్వాడీలు, గుజరాతీలు, జైనుల కుటుంబాలు సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు కూడా రంగుల పండగను జరుపుకున్నారు. హోలీ రంగుల్లా అందరి జీవితాలూ రంగులమయంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

జీజీహెచ్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు 'రంగ్ ఉత్సవ్' పేరుతో హోలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్లు, జూనియర్లు అన్న తారతమ్యం లేకుండా అంతా కలిసి రంగుల పండుగ జరుపుకుని ఐకమత్యాన్ని చాటిచెప్పారు. కళాశాల యాజమాన్యం తోడ్పాటు అందించింది. ఆయా తరగతుల క్లాస్ రిప్రజెంటేటివ్ (సీఆర్)లు హోలీ వేడుకల నిర్వహణను పర్యవేక్షించారు. డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరై వేడుకను వీక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ పరికరాలు అందజేస్తున్న పార్కర్ వెల్‌బోర్న్ సంస్థ ప్రతినిధి కస్తూరిరావు

దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వాకలపూడిలోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం పార్కర్‌వెల్ బోర్న్ ఐటీఎస్ సంస్థ ఆధ్వర్యంలో 90మంది దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను ఆ సంస్థ ప్రతినిధి కస్తూరిరావు పంపిణీ చేశారు. 60 మందికి కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, 20 మందికి వీల్‌చైర్లు, వాకర్లు, 10 మందికి వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, పీడీ కె.ఆదినారాయణరెడ్డి, జాయింట్



డైరెక్టర్ ఎస్.ఉమారెడ్డి, ఎస్‌పి నాయుడు, పార్కర్ వెల్‌బోర్న్ సంస్థ ప్రతినిధులు టి.కరుణ, బి.అమూల్య, పి.నవీన్ పాల్గొన్నారు.

18న మధ్యాహ్న భోజనం కార్మికుల 'చలో విజయవాడ'

పెద్దాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 18న తలపెట్టిన 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి పిలుపునిచ్చారు. పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో కరక సుబ్బలక్ష్మి అధ్యక్షతన మిడ్డే మీల్స్ వర్కర్ల విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. బొట్టా లక్ష్మి, మేడిశెట్టి వెంకటకుమారి, రాజ్యలక్ష్మి, కరక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి నుంచి భారీ ర్యాలీగా చిత్రాడకు...

కొత్తపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల నుంచి ఆటోలు, బైక్‌లపై వచ్చిన జన సైనికులు కొత్తపల్లి సురక్ష ప్యాలెస్ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం భారీ ర్యాలీని జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఉప్పాడ, కొత్తపల్లి, వాకతిప్ప, ఇసుకపల్లి సెంటర్, కొండెవరం, నవఖండ్రవాడ మీదుగా చిత్రాడలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు ర్యాలీగా తరలివెళ్లారు. కొత్తపల్లిలో జన సైనికుడు, పవన్‌కల్యాణ్ వీరాభిమాని స్టెప్పులేస్తూ జనసేన ఆవిర్భావ సభకు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

వెళ్తున్న కార్యకర్తలను ఉర్రూతలూగించాడు. ఆరుపదుల వయసున్న వ్యక్తి పవన్ మాదిరిగా మెడ కింద చేయి రాసుకుంటూ స్టెప్పులేసి జనసైనికుల్లో ఊపుతీసుకొచ్చాడు.



మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

పాదగయలో ప్రముఖుల పూజలు

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని శుక్రవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనందసాయి, ఎమ్మెల్యే బాలరాజు, సినీ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, దేవదాయ శాఖ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు కోటేశ్వరరావు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ముఖ్య నేతలను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శుక్రవారం చక్రస్నానం జరిపించారు. సాయంత్రం చతుఃస్థానార్చన, బలి, ధ్వజావహరోహణం, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, శాత్తుమొర, విద్వత్సంభావన జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మానవహారంతో ఐన్‌స్టీన్‌కు నివాళి

గొల్లప్రోలు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం మానవహారం నిర్మించి నివాళులర్పించారు. మార్చి 14 ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.

17న కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. హాల్‌మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్ కంపెనీలో జూనియర్ అకౌంటెంట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బీకాం, ఎంకాం, ఎంబీఏ (సీఏ ఇంటర్) ఉత్తీర్ణులైన ఫ్రెషర్స్, ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారు, టాలీ, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో అవగాహన ఉన్న పురుష అభ్యర్థులు అర్హులన్నారు. మెన్‌క్రైన్ ఫార్మా కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్, నిట్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. డీయూజీకేవై స్కిల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.35 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76333 నెంబరులో సంప్రదించాలని పీడీ లచ్చారావు కోరారు.

పవన్‌కల్యాణ్‌కు కొండబాబు అభినందనలు

కాకినాడ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సేవ, నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఆనందకరమంటూ ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శుక్రవారం అభినందనలు తెలిపారు. చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు రాష్ట్రం నలుమూలల నుంచి అశేషంగా తరలివచ్చిన ముఖ్య నాయకులు, జన సైనికులు అభినందనీయులన్నారు.

పిఠాపురం తరలిన జనసైనికులు

జగ్గంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నుంచి జనసైనికులు పిఠాపురం తరలివెళ్లారు. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాలాల నుంచి జగ్గంపేటకు చేరుకుని అక్కడ నుంచి జాతీయ రహదారి మీదుగా పిఠాపురం జనసేన ఆవిర్భావ సభకు మోటార్‌సైకిళ్లు, కార్లతో పాటు బస్సుల్లో భారీ సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు వెళ్లారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మావోయిస్టులకు ఆశ్రయం కల్పించవద్దు: ఎస్ఐ



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మోతుగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బచ్చులూరు గ్రామంలో డొంకరాయి ఎస్ఐ శివ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న కొంతమంది మావోయిస్టులు ఏవోబి ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం వచ్చినందున గ్రామ ప్రజలెవరూ కూడా గుర్తుతెలియని వ్యక్తులకు, మావోయిస్టులకు ఆశ్రయం కల్పించవద్దని, అలాగే సహకారం అందించవద్దని వివరించారు. మావోయిస్టుల వల్ల వినాశకర పరిస్థితులే తప్ప అభివృద్ధి ఉండదన్నారు. చుట్టుపక్కల అడవి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులకు సంబంధించిన సమాచారం పోలీసులకు వెంటనే అందించాలని కోరారు. సమావేశంలో బొడ్డగండి గ్రామ సర్పంచ్ వేమా సంధ్యారాణి, ట్రైనింగ్ ఎస్ఐ ఆరిఫ్, హెడ్ కానిస్టేబుల్ మొహిద్దీన్, కానిస్టేబుల్ గంగరాజులు పాల్గొన్నారు.

గండిపోశమ్మకు పంచామృతాభిషేకం



దేవీపట్నం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోలీ పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారికి ఆలయ అధికారులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులు, భక్తులు 108 బిందెల గోదావరి నీళ్లను తీసుకొచ్చి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రైతులకు స్ప్రేయర్ల పంపిణీ



రంపచోడవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్ ఎన్‌టీసీలో శుక్రవారం గిరిజన రైతులకు సబ్సిడీతో స్ప్రేయర్లను జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు కారం సురేష్, వైస్ ఎంపీపీ కె.బాల కృష్ణ, ఉద్యానవన సబ్ అసిస్టెంట్లు అబ్బాయిరెడ్డి, నూకరాజు, నాగరాజు, భీమన్న పాల్గొన్నారు.

రాములోరు పెళ్లి కొడుకాయెనే!



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీఆర్‌పురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) హోలీ పండుగను పురస్కరించుకుని శ్రీరామగిరి గుట్టపై కొలువై ఉన్న శ్రీసుందరసీతారామ స్వామివార్లను పెళ్లికూతురు, పెళ్లికొడుకు చేసే ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రెండో భద్రగిరిగా పేరుగాంచిన శ్రీసుందరసీతారామచంద్రస్వామివారి తిరుకల్యాణ మ హోత్సవం ఏప్రిల్ 6వ తేదీన జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఆలయ అధికారుల ఆదేశాలతో ఆలయ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్ సమక్షంలో అర్చకులు పురుషోత్తమాచార్యులు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణతంతును జరిపిస్తున్న అర్చకులు

ఎటపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారిని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపం వేదికపై ఆశీనులు గావించారు. రెండు గంటలకు అర్చకులు గొట్టుపుళ్ల రాజగోపాళ చార్యులు, చక్రవర్తుల రఘునాథచార్యులు, భరత్వాజచార్యులు ఆధ్వర్యంలో కల్యాణతంతును వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు విలీన మండలాలతో పాటు తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలు భక్తులకు అందించారు.

దేవీపట్నంలో హోలీ వేడుకలు



దేవీపట్నం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను పిల్లలు ఘనంగా నిర్వహించుకున్నారు. రంగులు పులుముకుని నీళ్లు జల్లుకుని సందడి చేశారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

దేవీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరై మాట్లాడారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి మళ్లీ మండల పరిషత్ సమావేశంలో పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎంపీపీ మురళి, జడ్పీటీసీ సత్యవేణి పెద్దబ్బు, వైస్ ఎంపీపీ గారపాటి మురళి, నాయకులు కందుల బాబ్జి, కట్ట సత్తిబాబు, గొర్ల గోపి పాల్గొన్నారు.

వేదోక్తంగా అగ్నిప్రతిష్ఠ

ఎటపాక, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉష్ణగుండాల వద్ద లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న అష్టలక్ష్మీ యాగంలో భాగంగా శుక్రవారం తొలి ఘట్టాన్ని ప్రారంభించారు. వేదోక్తంగా అగ్ని ప్రతిష్ఠయాగం నిర్వహించారు. అష్టలక్ష్మీ పీఠాధిపతి పీతాంబర రఘునాథాచార్యులు నేతృత్వంలో యజ్ఞాచార్యరఘు పుంగవాచార్యులు, పాడిచేటి సీతారామాచార్యులుతో పాటు వివిధ పుణ్యక్షేత్రాల నుంచి తరలివచ్చిన ఋత్వికులతో వేదమంత్రాల నడుమ అగ్ని ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం, స్వామి వారికి అష్టోత్తర అర్చన ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠలో భాగంగా అగ్ని పుట్టించేందుకు అరణీ చెక్కతో వేదమంత్రాల నడుమ అగ్ని మథనం ద్వారా అగ్నిని పుట్టించి, అష్టలక్ష్మీ యాగం ప్రారంభించి, పూర్ణాహుతితో అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం ముగించారు.

కోర్టు విధుల బహిష్కరణకు న్యాయవాదుల నిర్ణయం

రంపచోడవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని రెవెన్యూ కోర్టుల్లో ప్రాక్టీసు చేసేం దుకు ప్రభుత్వ ఏజెంటు అయిన జిల్లా కలెక్టరు నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాలంటూ రంపచోడవరం సబ్‌కలెక్టర్ జారీచేసిన నోటీ సుపై నిరసనగా రంపచోడవరం బార్ అసోసి యేషన్ న్యాయవాదులు నిరవధిక కోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. శుక్రవారం రంపచోడవరం బార్ అసోసియేషన్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో న్యాయవాదులందరూ తీర్మానం చేశారు. న్యాయవాదులు చట్టం ప్రకారం భారత బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదైన న్యాయవాదులు ఎటువంటి కోర్టులు, ట్రిబ్యునళ్లు, ఇతర ఏకోర్టుల్లోనైనా ప్రాక్టీసు చేసే అవకాశం ఉంటే అం దుకు భిన్నంగా సబ్‌కలెక్టర్ కొత్త తరహా నిబం ధనలను రూపొందించడం చట్ట విరుద్ధమని బార్‌న్యాయవాదులు తీర్మానించారు. బార్ అధ్యక్షుడు ఎ.ఆర్.ఆర్.భగవాన్ అధ్యక్షతన జరిగిన సీనియర్ న్యాయవాది కె.ఎన్. వి.రమణ, న్యాయవాదులు డి.శ్రీధర్, బి.వెంకటే శ్వరరావు, మాదే బాల సత్యనారాయణ, వై.వి.రమణయ్య, ఎండీ జిలానీ, టి.వెంక ట్రావు, వీరబాబు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఆవిర్భావ సభకు తరలివెళ్లిన జనసైనికులు



తుని రూరల్ : మాట్లాడుతున్న జనసేన నాయకుడు చిన్నబాబు



తొండంగిలో భోజన ఏర్పాట్లు చేసిన జనసేన నాయకులు

తునిరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తుని నుంచి జనసేన శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్లారు. తుని నియోజకవర్గ నలుమూలల నుంచి తునిపట్నంలో గల రాజా మైదానానికి చేరుకుని అక్కడి నుంచి నాయకులు బైకులు, కార్లలో ర్యాలీగా పిఠాపురం సభకు తరలివెళ్లారు.

కోటనందూరు: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మండలం నుంచి చిత్రాడకు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పెదపాత్రుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులు, కార్లు బైక్‌ల మీద భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పెనుముచ్చు ప్రవీణ్, నాగుర్, అడిగర్ల తమ్మయ్య, అల్లు రాజు, తదితరులు తరలివెళ్లారు.

ప్రత్తిపాడు: పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పవన్‌కల్యాణ్ జనసేన ఆవిర్భావ సభకు ప్రత్తిపాడు మండలం నుంచి పెద్దఎత్తున జనసైనికులు తరలివెళ్లారు. మండల గ్రామాల నుంచి ఆటోలు, చిన్నకార్లపై, ద్విచక్రవాహనాలపై ర్యాలీగా జనసైనికులు చిత్రాడ తరలివెళ్లారు.

తొండంగి : జయకేతనం సభకు తరలి వెళ్లిన జనసైనికులకు మండల పరిధి తమ్మయ్యపేట శివారు నిఖిల్ హైవే దాబావద్ద భోజన ఏర్పాట్లు చేశారు. విశాఖ, తదితర జిల్లాల నుంచి వచ్చే వారికి అన్ని ఏర్పాట్లుచేశారు. సభ అనంతరం తిరిగి వెళ్లే సైనికుల కోసం బెండపూడి హైజంక్షన్ వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. జనసైనికులకు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో భారీటెంట్లు ఏర్పాటుచేసి భోజనం అందించారు.

అన్నవరం: చిత్రాడలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్లిన అసంఖ్యాక జనసైనికులు, వీరమహిళలకు ఎక్కడా ఇబ్బందుల తలెత్తకుండా భోజన ఏర్పాట్లతో సంతృప్తి వ్యక్తమైంది. చేబ్రోలు మొదలుకుని చిత్రాడ వరకు ఆరు ప్రత్యేక శిబిరాలలో భోజన ఏర్పాట్లు చేశారు. అక్కడ జనసేన వలంటీర్లు దూరప్రాంతాల నుంచి సభకు విచ్చేసిన వారికి వాహనాలు ఆపి కేంద్రాల వద్దకు తీసుకెళ్లారు. మండుటెండలో నడిచివచ్చిన వారికి చల్లని మజ్జిగ అందించారు. సభ రాత్రి ప్రారంభమైనా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి మధ్యాహ్నానికే జనాలు చేరుకున్నారు. ఇటువంటి సభల నిర్వహణ సమయంలో చాలామంది అర్ధాకలితో వెనుతిరిగి వెళ్లేవారని పక్కా ప్రణాళికలతో చేసిన ఏర్పాట్లు భేష్ అనిపించాయి.

● కన్నడిగుల అభిమానం

కర్ణాటక రాష్ట్రం చిక్‌బలాపూర్ నుంచి పలువురు జనసేన, పవన్‌కల్యాణ్ అభిమానులు తరలివచ్చారు. కన్నడభాషలో జైజనసేన, జై పవన్ కల్యాణ్ ప్లకార్డులతో వారు సభకు తరలిరాగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 200 మంది చిక్‌బలాపూర్ నుంచి విచ్చేసినట్లు తెలిపారు.

● బేంబూ చికెన్ విక్రయాలు

జనసేన ఆవిర్భావ సభకు విచ్చేసిన జనసైనికులు కోసం ఒకవైపు పార్టీ నాయకులు ఆహార పొట్లాలు అందించగా పొట్టకూటి కోసం ఏజెన్సీ ప్రాంతం నుంచి విచ్చేసిన పలువురు బేంబూ చికెన్ అమ్మకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రోడ్డుపక్కనే పిఠాపురం దాటాక ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిని కొనుగోలు చేసి ఆరగించేందుకు పోటీపడ్డారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు సమస్యలు వివరించిన సీఆర్పీలు

తొండంగి, మార్చి 14 ఆంధ్రజోతి)): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ను కలిసిన సీఆర్పీలు తమ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. శుక్రవారం కాకినాడలో వారు రాజశేఖర్‌ను కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంజీ, కాకినాడజిల్లా అధ్యక్షుడు టి.మీరాసాహెబ్, ఉపాధ్యక్షుడు వి.వీరప్రతాపరెడ్డి తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే నాయీబ్రాహ్మణులకు న్యాయం

తొండంగి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంలోను నాయీ బ్రాహ్మణులకు సరైన న్యాయం జరుగుతుందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొరుప్రోలు నూకరాజు(చిన్నా) అన్నారు. శుక్రవారం శృంగవృక్షంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 450 కోట్ల కేటాయింపు, ఆదరణ పథకానికి 1000కోట్ల కేటాయింపు చేసారన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



సహాయకమిషనర్ రామ్మోహనరావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒకదాత రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్యాలగూడకు చెందిన జంపల వెంకట రమణ ఈమొత్తాన్ని ఆలయ సహాయ కమిషనర్ రామ్మోహనరావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదాలు ప్రత్యేక దర్శనం కల్పించారు.

24, 25 తేదీల్లో బ్యాంక్‌లు బంద్

గండేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది కొరత, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో బ్యాంకులు బంద్ చేపడుతున్నట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ (ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ) జనరల్ సెక్రటరీ కామ్రేడ్ ఎల్.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారున పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ రాజమహేంద్రవరం మాడ్యూల్ తుని రీజియన్ రీజనల్ కమిటీ సమావేశం నిర్వహించారు.రాజమహేంద్రవరం మాడ్యుల్ బ్యాంకు ఉద్యోగులు, తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వనదుర్గ ఆలయంలో శుక్రవారం ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం హోమాలు, జపములు నిర్వహించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

ఉల్లాసంగా హోలీ పండుగ



ఏలేశ్వరంలో హోలీ జరుపుకుంటున్న స్నేహితులు

ఏలేశ్వరం, మార్చి 14 (ఆం ధ్రజ్యోతి): వసంత రుతువులో పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ హోలీ సంబరాల్లో చిన్నారులు, యువత సందడి చేశారు. ప్రేమ, స్నే హం, అప్యాయత,అనురాగంతో ఏలేశ్వరంలో హోలీ పండగను చిన్నారులు, పెద్దలు శుక్రవారం ఆత్మీయ వాతావరణంలో జరుపుకున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఏళ్ల తరబడి నివసిస్తున్న మార్వాడీ కుటుంబాలు రంగు నీళ్ల చల్లుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ప్రత్తిపాడు: మండలంలో శుక్రవారం హోలీ పండుగ ఉత్సాహంగా, ఉల్లాసంగా యువత, విద్యార్థులు గ్రామాల్లో రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

హోలీ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పలువురు నాయకులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో భజనలకు అవకాశం ఇవ్వాలి



ధర్మవరంలో జిల్లా భజన కళాకారుల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఏడాది పొడవునా కొండపై అఖండనామ సంకీర్తనకు జిల్లాలోని భజన సమాజాలకు అవకాశం కల్పించాలని జిల్లా భజన మండలి సంఘం తీర్మానించింది. మండలంలోని ధర్మవరం నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం జిల్లా భజన మండలి సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి దేవస్థానం మాదిరిగానే అన్నవరం దేవస్థానం కూడా జిల్లాలోని భజన సమాజాలకు భజన సంకీర్తనలు, నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ నెల 26న అన్నమయ్య వర్ధంతి సందర్భంగా కొండపై జరిగే సమావేశంలో ఓ భజన కళాకారులు మరో మారు దేవస్థానం ఈవోకు వినతి పత్రం అందజేసేందుకు ఈ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో జిల్లా సంఘ కన్వీనర్ సానా నూకరాజు నాయుడు, యాళ్ల ప్రభాకరరావు, అప్పల స్వామి, సూర్యనారాయణ, సిద్దా పెద్దిరాజు, భవిరిశెట్టి వెంకట్రావు, లక్ష్మి, కొండలరావు, తదితరులు ప్రసంగించారు.

పుణ్యక్షేత్రాలకు బైక్ యాత్ర చేస్తున్న స్వామిజీకి సత్కారం



స్వామిజీని సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసికి చెందిన అంకుష్ రామనాథ్ స్వామిజీ వారణాసి నుంచి పుణ్యక్షేత్రాలకు బైక్ యాత్ర చేపట్టారు. కలకత్తా కాళీ మాత, అసరవిల్లి సూర్యనారాయణ స్వామి, సింహాచలం అప్పన్న, అన్నవరం సత్యనారాయణస్వామిలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట మీదుగా వెళుతున్న ఆయనకు భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి ఘనంగా సత్కరించి రాత్రి స్థానికంగా బస ఏర్పాటు చేశారు. శుక్రవారం రోజంతా ఇక్కడే విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయనకు ప్రయాణంలో ఆరోగ్య సమస్య రావడంతో డాక్టర్‌కు చూపించి శనివారం ఉదయం మళ్లీ ప్రయాణం కొనసాగే ఏర్పాట్లు చేశారు. శనివారం జగ్గంపేట నుంచి బయల్దేరి విజయవాడ దుర్గమ్మ, తిరుపతి వెంకన్న దర్శనం చేసుకుని తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలో ఉన్న పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లనున్నట్టు నాగేంద్ర చౌదరి పేర్కొన్నారు.

రాచపల్లి అరుణాచలేశ్వరుడికి పౌర్ణమి పూజలు

ప్రత్తిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరుడికి శుక్రవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. అరుణాచలేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పంచ హారతులు ఇచ్చారు. అపీత కుచాంబ అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణలు చేసి కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా పొదుపు సంఘం నుంచి ..
రూ. 2.41 లక్షలు మాయం

అధికారులకు డ్వాక్రా సంఘ సభ్యుల ఫిర్యాదు

ప్రత్తిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి చెందిన సదాశివ డ్వాక్రా సంఘం బ్యాంక్ ఖాతాలోని పొదుపు చేసిన సొమ్ము రూ.2.41లక్షలు మాయమైంది. ఉత్తరకంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లోని సదాశివ గ్రూపు ఖాతా నుంచి గత రెండు నెలల వ్యవధిలో పొదుపు ఖాతా సొమ్ము దఫదఫాలుగా మాయం చేసినట్లు బ్యాంక్ అధికారులు కూడా గుర్తించారు. దీనిపై ఆ గ్రూపు సభ్యులు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావుకు, స్థానిక వెలుగు ఏపీఎం వై.వెంకట్రావులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సదాశివగ్రూపు ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా నుంచి యూపీఐ లావాదేవీల ద్వారా పొదుపు సొమ్ము రూ.2.41లక్షలు డ్రా చేసినట్లు గుర్తించి సంబంధిత బ్యాంక్ మేనేజర్ లలిత్ పరిశీలించి గ్రూపు సభ్యులకు తెలిపారు. దీంతో ఖాతా నుంచి డబ్బులు మాయమైన విషయాన్ని గ్రూపు అధ్యక్షురాలు చింతల పార్వతి, కార్యదర్శులు కొట్టేటి పార్వతి, చింతల నాగమణిలు అధికారులకు ఫిర్యాదు చేశారు. జనవరి 14నుంచి మార్చి 7వ తేదీల మధ్య యూపీఐ ద్వారా 27 లావాదేవీలు జరిపి సొమ్ము బదిలీ చేశారని బ్యాంకు అధికారులు తెలిపారు. ప్రతి డ్వాక్రా గ్రూపు నుంచి సురక్ష యోజన, జీవన జ్యోతి పథకాలు బ్యాంకు వారే రెన్యూవల్ చేస్తారు. ఈ క్రమంలో బ్యాంక్ మేనేజర్ లలిత్ ఈ పథకం రెవెన్యూవల్ చేసేందుకు ఖాతాలు పరిశీలిస్తే ఖాతాలో కేవలం రూ.760 మాత్రమే ఉన్నాయని గుర్తించి డ్వాక్రా సభ్యులకు సమాచారం అందించారు. రూ.2.41 లక్షలు సైబర్ మోసం ద్వారా మాయమైనట్లు గుర్తించినట్లు మండల వెలుగు ఏపీఎం తెలిపారు. దీనిపై శనివారం స్థానిక పోలీసులకు సంబంధిత డ్వాక్రాసంఘం శనివారం ఫిర్యాదు చేయనుందని ఏపీఎం వెంకట్ తెలిపారు.

గండేపల్లిలో 'జనసేన' ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న జనసేన పార్టీ ఇన్‌చార్జి రమేష్

గండేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో శుక్రవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆవిర్భావ సభ కోఆర్డినేటర్లు అక్కల గాంధీ, శ్యాం సుధాకర్, జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ జెండా వందనం చేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న వసంత్

గండేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మురారి గ్రామంలో జీఎస్‌ఎల్ దంత వైద్యశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ జాస్తి వసంత్, జీఎస్ఎల్ దంతవైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దంత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 19న గ్రామంలో కాకతీయ కల్యాణ మండపం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ తెలిపారు.

'ఆదిత్య'లో సీపీఆర్‌పై అవగాహన సదస్సు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కార్డియో పల్మోనరీ రిససిటేషన్(సీపీఆర్) అవగాహన కోసం బేసిక్ లైఫ్ సపోర్ట్ ఈవెంట్‌ను నిర్వహించారు. దీనిని ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ వనతి ప్రారంభించారు. విద్యార్థులు, సిబ్బంది అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా అపోలో షైన్‌కు చెందిన డాక్టర్ గనిశెట్టి ఉమాశంకర్ పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి జయంతి పూజలు

జగ్గంపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సర్వ సంపదల అధినేత్రి లక్ష్మీదేవి కరుణ లేకపోతే ఎన్ని తెలివితేటలున్నా ఉపయోగం లేదని తెలిపారు. హోలీ పండుగ రోజు లక్ష్మీదేవి జయంతి కావడంతో జగ్గంపేట రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామంలోని అనేక మంది మహిళలతో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి.. లక్ష్మీదేవికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు)మాధురి అండాళ్ దంపతులు, దాట్ల సురేష్‌బాబు, గెడ్డమూరి బాబ్జీ, పీటీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, చినశంకర్లపూడిలో ముద్రగడ గిరిబాబు పర్యటన

ప్రత్తిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, చినశంకర్లపూడి గ్రామాల్లో శుక్రవారం ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఈ రెండు గ్రామాల్లోను సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఏపూరి రామారావు గిరిబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడారు. కార్యక్రమాల్లో గుడాల వెంకటరత్నం, శేరుకృష్ణ, బదిరెడ్డి గోవిందు, జువ్విన వీర్రాజు, జలిగంపల ప్రభాకరరావు, గోళ్ళ శేఖర్‌బాబు, డాక్టర్ అద్దే చిట్టికొండ తదితరులు పాల్గొన్నారు.